క్లుప్తంగా

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నేరడిగొండ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని లఖంపూర్ గ్రామంలో గల హనుమాన్ ఆలయాన్ని దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పని ఒత్తిడి కారణంగా చాలా మంది అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రతిరోజు ఆలయాల్లో పూజ కార్యక్రమాలు నిర్వహించడంతో ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. అనంతరం ఆలయ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో దేవేందర్ రెడ్డి, సురేందర్, శేఖర్ పాల్గొన్నారు.

కబ్జాలను తొలగించిన పంచాయతీ అధికారులు

ఇచ్చోడ: కబ్జాకు గురవుతున్న రోడ్లు అనే శీర్షికన సాక్షిలో ఇటీవల ప్రచురితమైన కథనానికి మెజార్ పంచాయతీ అధికారులు స్పందించారు. శనివారం సిరిచెల్మ చౌరస్తాకు ఎదురుగా టీచర్స్‌కాలనీలో పంచాయతీ రోడ్డుపై వేసిన టేలను తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. పంచాయతీ రోడ్డును అక్రమించుకొని టేల వేసుకున్న వ్యక్తికి నోటీలు అందజేసినా.. టేల తొగించక పోవడంతో పంచాయతీ సిబ్బంది ద్వారా తొలగించినట్లు తెలిపారు.

40వసారి రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ రిమ్స్ బ్లడ్‌బ్యాంక్ ల్యాబ్ టెక్నిషియన్ అల్లూరి సతీష్‌రెడ్డి శనివారం 40వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. రక్తనిధిలో పనిచేసే ఆయన దాని ప్రాధాన్యతను గుర్తించి తరచూ రక్తదానం చేస్తుంటారు. అలాగే మరో పది మంది తన స్నేహితులతో రక్తదానం చేయించారు. రిమ్స్ సూపరింటిండెంట్ అశోక్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ సుధాకర్ ఆయనను అభినందించారు.

కార్యవర్గం ఎన్నిక

ఉట్నూర్‌రూరల్: రాజ్‌గోండు సేవా సమితి ఆదిలాబాద్ జిల్లా, డివిజన్, మండల కమిటీలను ఉట్నూర్ గుస్పాడిగుట్టలో శనివారం ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఆత్రం గంగాధర్, జిల్లా అధ్యక్షుడిగా వెడ్మ కొద్దు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గేడం నిరంజన్, ఉపాధ్యక్షుడిగా ఆడ మాన్కు పటేల్, పర్చకి ఆనంద్‌రావు, అర్క ఓమేశ్, ఆత్రం పరుశురాం, కొడప రాధబాయి, కోశాధికారిగా బొంత ఆశారెడ్డి, కార్యదర్శి ముకాడే విష్ణు, సంస్కృతి కార్యదర్శి పురుషోత్తం, సభ్యులు సోనిరావు, మారుతి, రాజేశ్‌లను ఎన్నుకున్నారు. అదే విధంగా మండల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా భీంరావు, అధ్యక్షుడిగా గుడిపల్లి భీమన్న, ప్రధాన కార్యదర్శిగా ఆత్రం కాశిరాం, ఉపాధ్యక్షుడిగా మెస్రం కేశవ్‌రావు, కోశాధికారి వెంకటేశ్, ప్రచార కార్యదర్శి ముకుంద్‌రావు, సంస్కృతి కార్యదర్శి కుంరరవి, సభ్యులుగా సోనేరావు, తెలంగ్‌రావు, భీమ న్న, సురేశ్‌లను ఎన్నుకున్నారు. డివిజన్ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా పుర్క గజానంద్, అధ్యక్షుడిగా ఆత్రం ప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా బాలా జీ, ఉపాధ్యక్షుడిగా మెస్రం జగన్, కోశాధికారి గా మారుతి, ప్రచార కార్యదర్శిగా కేశవ్, సంస్కృతి కార్యదర్శి పెందూర్‌విజయ్‌లను ఎన్నుకున్నారు.

యువకుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన అస్లాంఖాన్(26) అదృశ్యమయ్యాడు. మేస్త్రీ పనులు చేసే అతడు గత నెల 28న తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టు పక్కల గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం టు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

పదోన్నతిపై ఉపాధ్యాయుడు.. ఖాళీగా విద్యార్థులు



గదిలో ఖాళీగా కుర్చీ, విద్యార్థులు

ఆదిలాబాద్‌రూరల్: గిరిజన సంక్షేమ శాఖ ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బూర్నూర్ గిరిజన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయున్ని పదోన్నతిపై శుక్రవారం ఇతర చోటికి బదిలీ చేసింది. పాఠశాలకు ఉపాధ్యాయుడిని కేటాయించకపోవడంతో శనివారం విద్యార్థులు తరగతి గదిలో ఖాళీగా కూర్చోవాల్సి వచ్చింది. 'సాక్షి' పాఠశాలకు వెళ్లినా విషయాన్ని తెలుసుకున్న ఉపాధ్యాయుడు తనకు పదోన్నతి రావడంతో వేరే పాఠశాలకు జాయినింగ్ కోసం మామిడిగూడ కాంప్లెక్స్‌కు వెళ్తున్నానని పేర్కొన్నారు. కాంప్లెక్స్ పరిధిలోని ఎస్‌సీఆర్‌పీ సంబంధిత పాఠశాల ఉపాధ్యాయుడు పదోన్నతిపై వెళ్లారని, మరో ఉపాధ్యాయున్ని కేటాయించే వరకు పోస్టు ఖాళీగానే ఉంటుందని సమాధానం ఇచ్చారు.

సవరణలకు అవకాశం

బోథ్: ప్రజాపాలన దరఖాస్తులో సవరణలకు అవకాశం ఉందని ఎంపీడీవో జీవన్ రెడ్డి శనివారం తెలిపారు. దరఖాస్తు ఫారంలో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకొని వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రుణమాఫీ కాలేదని రైతుల ఆందోళన

- అర్హులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్



బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

నేరడిగొండ: మండలంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట శనివారం రైతులు ధర్నా నిర్వహించారు. రుణమాఫీ డబ్బులు జమ కాలేదని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గిరిజన లంబాడాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ వారికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో లైవ్ మండల అధ్యక్షుడు సందీప్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

తాంసి: ప్రస్తుతం రుణమాఫీ కొందరికి వచ్చి కొందరికి రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు కూడా తలలు పట్టుకుంటున్నారు. మండలంలోని కప్పర్లలో శనివారం రుణమాఫీ రాని రైతులంతా గ్రామంలోని బ్యాంక్ వద్ద ఏఈవోని వివరాలు అడుగడానికి వచ్చారు.

బోథ్: తమకు రుణాలు మాఫీ కాలేదని బోథ్ మండల రైతులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు బోథ్ మండల కేంద్రంలో రైతులు సమావేశమయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను డప్పుచప్పుళ్లతో గ్రామంలో ఊరేగించారు. సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. బోథ్ బస్టాండ్ వద్ద సీఎం దిష్టిబొమ్మ దహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. బస్టాండ్ వద్ద రైతులు బైఠాయించారు. రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

తలమడుగు: అర్హులైన రైతులకు రుణమాఫీ కాలేదని రైతులు ఆందోళన చేపట్టారు. శనివారం మండలకేంద్రంలో సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర చేపట్టారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా పోలీసులు, రైతుల మధ్య తోపులాట జరిగింది.

జైనథ్: రుణమాఫీ రాలేదంటూ మండలంలో రైతులు రోడ్డెక్కారు. జైనథ్ –బేల జాతీయ రహదారిపై స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. ముళ్ల కంచెలు వేసి వాహనాల రాకపోకలు నిలిపివేశారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. ఎస్సై పురుషోత్తం, సీఐ సాయినాథ్, తహసీల్దార్ శ్యాంసుందర్, డీఎస్పీ జీవన్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ విజ్ఞాన్ మాలవ్య రైతులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో ఫోన్‌లో మాట్లాడించారు. కలెక్టర్ మూడు రోజుల్లో సమస్య తీరుస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

గిమ్మ గ్రామంలో..

మండలంలోని గిమ్మ గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో తమ గ్రామానికి అన్యాయం జరిగిందని వాపోయారు. బ్యాంక్‌కు తాళం వేసి అధికారులను అడ్డుకున్నారు. గిమ్మ ఎక్స్‌రోడ్డు వద్ద రోడ్డుపై ఆందోళన నిర్వహించారు. సీఐ పురుషోత్తం, జిల్లా వ్యవసాధికారి పులయ్య రైతులను సముదాయించారు. కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలి

- డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి
- రుణమాఫీపై ఆందోళన చెందవద్దని రైతులకు భరోసా



మాట్లాడుతున్న అడ్డి భోజారెడ్డి

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నాయకులు బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రుణమాఫీ, ప్రభుత్వంపై వారు చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. పదేళ్ల పాలనలో రైతులను మోసగించిన వారికి రుణమాఫీపై మాట్లాడే అర్హత లేదన్నారు. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా ఇబ్బందులు వస్తున్నాయని, వాటిని కూడా పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్‌ఎస్ నాయకులు చేసిన తప్పుల చిట్టా, వారి జాతకాలను బయటపెడుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్, చరణ్‌గౌడ్, సంద నర్సింగ్, పోరెడ్డి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను కేటాయించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తాంసి: మండలంలోని పొన్నారి ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని గ్రామస్తులు ఎంఈవో శ్రీకాంత్‌ను కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం పాఠశాలలో పనిచేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయుల్లో ఇద్దరు ఉపాధ్యాయులు ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందుతున్నారని తెలిపారు. ఇద్దరు ఉపాధ్యాయులు రిటైర్డ్ అయితే ఒక్క ఉపాధ్యాయురాలు మాత్రమే ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు రమణ, రఘు, మాజీ సర్పంచ్ అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రుణమాఫీపై ఆందోళన చెందవద్దు



మాట్లాడుతున్న ఆడే గజేందర్

తలమడుగు: రుణమాఫీపై రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని అర్హులైన రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయడం జరుగుతందని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం మండలంలోని దేవాపూర్ గ్రామంలో విలేకరుల సమావేశం మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 56409 ఖాతాదారులకు గాను రూ.615.59 కోట్ల రూపాయలతో రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. కొన్ని బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు రుణామాఫీలో నష్ట జరిగిందన్నారు. ఇచ్చిన మాటకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతిపక్షల మాటలను ఎవరు నమ్మి మోసపోవద్దన్నారు. రుణమాఫీ కానీ రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోక గణేష్ రెడ్డి, కళ్యాణ లక్ష్మి రాజేశ్వర్, కొడల సంతోష్, వెంకన్న యాదవ్, రామ్ రెడ్డి, పోశెట్టి, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తాంసి: రైతురుణమాఫీలో ఆంక్షల పేరుతో పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ చేయకపోవడాన్ని నిరసిస్తూ భీంపూర్ మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించి దహనం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హమీ మేరకు ప్రతీరైతు కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ రైతుబంధు సమితి అధ్యక్షుడు అనిల్, అఫ్రోజ్, నితిన్, లింబాజీ, సంతోశ్, రాజన్న, రవీందర్ పాల్గొన్నారు.

గిరిజనేతరులకూ 'పోడు' పట్టాలివ్వాలి

ఉట్నూర్‌రూరల్: అటవీ భూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజనులతోపాటు గిరిజనేతరులకు కూడా పోడు పట్టాలు ఇవ్వాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండ సురేఖ ను కోరారు. శనివారం హైదరాబాద్ సచివాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న అటవీ శాఖ, గిరిజనుల పోడు భూముల సమస్య మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో భారీ వాహనాల ప్రవేశాన్ని నిషేధించారని దీంతో వ్యాపార, వాణిజ్య రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని, ప్రజా అవసరాల దృష్ట్యా మంచిర్యాల నుంచి నిర్మల్ వరకు, ఉట్నూర్ నుంచి మంచిర్యాల వరకు భారీ వాహనాల ప్రవేశానికి ఉదయం 6గంటల నుంచి రాత్రి 9గంటల వరకు అనుమతి ఇవ్వాలని కోరారు.

హిందువులపై దాడులు అరికట్టాలి

ఉట్నూర్‌రూరల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ ఐక్యవేదిక బంద్‌కు పిలుపునివ్వగా శనివారం వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలు బంద్ పాటించాయి. ఈ సందర్భంగా ఉట్నూర్ పాత బస్టాండ్ నుంచి ఐబీ చౌరస్తా వరకు హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు రితేశ్ రాథోడ్, హిందూ ఐక్యవేదిక నాయకులు కొండేరి రమేశ్, లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని హిందూ సంఘాలు, బీజేపీ ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన గాదిగూడ బంద్ విజయవంతమైంద. మండల కేంద్రంలోని హనుమాన్ మందిరం నుంచి కుమురం భీం చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ గంగుబాయి సోము, బీజేపీ మండల అధ్యక్షుడు శివాజీ, ప్రధాన కార్యదర్శి మేస్రం వెంకటేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నేరడిగొండ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి అన్నారు. శనివారం మండలంలోని లఖంపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలోని 9, 10వ తరగతుల విద్యార్థులతో మాట్లాడి వసతి, సౌకర్యాలు, విద్య బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గది, వంట సరుకులను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సీజనల్ వ్యాధ్యులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ రావ్ మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి దృష్టికి తీసుకెళ్లారు. వార్డెన్ స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు

తాంసి: విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు సమస్యలు లేకుండా చర్యలు చేపడుతామని డీఈ హరికృష్ణ అన్నారు.శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడాన్ని నిరసిస్తూ జామిడి గ్రామస్తులు తాంసి సబ్‌స్టేషన్ ముట్టడించి ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. స్పందించిన డీఈ శనివారం తాంసి సబ్‌స్టేషన్ తనిఖీ చేసి సిబ్బందితో పాటు వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. వారి వెంట జీఎల్‌ఎం సంజీవ్, నజీర్, రైతులు పాల్గొన్నారు.

'రుణమాఫీపై మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేకు లేదు'

బోథ్: రుణమాఫీపై బీఆర్‌ఎస్, బీజేపీలు రైతులను రెచ్చగొడుతున్నాయని, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు రుణమాఫీపై మాట్లాడే అర్హత లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో నాయకులతో కలిసి మాట్లాడారు.

యోగా నిత్య జీవితంలో భాగం కావాలి



యోగా చేస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్: యోగా నిత్యజీవితంలో భాగం కావాలని జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పతంజలి యోగా శిక్షణ కేంద్రంలో శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాసన జిల్లాస్థాయి పోటీలను ప్రారంభించారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. యువత, విద్యార్థులు యోగాపై ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు.

రూ. 6 వేల పింఛన్ అమలు చేయాలి

ఎదులాపురం: దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్‌ను అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో శనివారం నిర్వహించిన మాట్లాడారు. ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, వికలాంగుల అందిస్తున్న పెన్షన్ ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వస్తే వికలాంగులకు రూ.6 వేల పింఛన్ అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి 8 నెలలవు అవుతున్నా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు.

నూతన కమిటీ..

ఎన్‌పీఆర్‌డీ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా బండి దత్తాత్రి, అధ్యక్షుడిగా మెస్రం నగేశ్, కార్యదర్శులుగా ఆరిఫా బేగం, ఉపాధ్యక్షుడిగా నుస్రత్ బేగం, ఎం. దత్తు, అనసూయ, సహాయ కార్యదర్శులుగా రాజేశ్, పోచన్న, శత్రుఘన్‌లతో పాటు పలువురిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఆర్‌ఎంపీలు



ఇచ్చోడ: నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది

ఎదులాపురం: వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యకు సంబంధించిన దోషులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఆర్‌ఎంపీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లబండి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బంద్ పాటించి నిరసన తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, అనిల్, రామోజీ వీరాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: కోల్‌కత్తాలో విధుల్లో ఉన్న డాక్టర్‌పై అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను బహిరంగంగా ఉరితీయాలని ఆర్‌ఎంపీ డాక్టర్ సంఘం మండల అధ్యక్షుడు చోలే రణవీర్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా దేశంలో రోజు రోజుకూ మహిళలపై అత్యాచారాలు పెరుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీ వైద్యులు ముండే సుదర్శన్, భారత్, సోన్‌కాంబ్లే బాబాసాహెబ్, సర్వాదే బాలాజీ, అమర్‌నాథ్, సగిరోదిన్, రాకేశ్ పాల్గొన్నారు.

ఎదులాపురం: వైద్య కళాశాల విద్యార్థిని హత్య చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెర్క గంగమ్మ, దుర్గం కళావతి అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురం భీమ్ భవనంలో శనివారం మాట్లాడారు. కలకత్తాలోని ఆర్జీ కార్ ప్రభుత్వ వైద్య కళాశాలలో విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలుపై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇప్పటికైనా రక్షణ చట్టాలను కఠినంచేసి అమలు చేయాలన్నారు. జిల్లా కోశాధికారి తారా బాయి, జిల్లా నాయకులు లక్ష్మి పాల్గొన్నారు.

ఇచ్చోడ: కోల్‌కతాలో జూనియర్ వైద్య విద్యార్థినిపై హత్యచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థిపై జరిగిన హత్యచారానికి నిరసనగా వైద్య సేవలను బహిష్కరించారు. నిరసనలో వైద్యాధికారి హిమబిదు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: కలకత్తా నగరంలో మెడికల్ కళాశాలలో ట్రైనీ వైద్యురాలిపై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని మండల కేంద్రంలోని పులాజీ బాబా పాఠశాల డైరెక్టర్ రాంకిషన్ అన్నారు. ఉపాధ్యాయ బృందంతో కలిసి కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బేల: దేశ వ్యాప్తంగా వైద్య సంరక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ప్రభుత్వ వైద్య బృందం విధులు బహిష్కరించి, స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు.

సంక్షిప్త వార్తలు

బంగారి అవ్వాల్ దేవతకు పూజలు

నార్నూర్: గాదిగూడ మండలం లోకారి కె గ్రామ శివారులో బంగారి అవ్వాల్ దేవతకు ఆదివాసీ మహిళలు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి వెళ్లి ముందుగా వనదేవతకు పూజలు చేశారు. అనంతరం బంగారి అవ్వాల్ దేవతకు సాంప్రదాయం ప్రకారం పూజలు చేసి వన భోజనం చేశారు. గ్రామ పటేల్ మేస్రం భీంరావు, మేస్రం జగ్గారావు దేవారి, గ్రామస్తులు ఉన్నారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌కు సన్మానం

నేరడిగొండ: బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నూతన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన న్యాయవాది పంద్రం శంకర్‌ను మండలంలోని లింగట్ల, గోండుగూడా పటేల్ గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు.

పలువురికి సత్కారం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ గ్రామానికి చెందిన పలువురు పద్మశాలీ కులస్తులు వివిధ రంగాల్లో రాణించడంతో పాటు ప్రశంసా పత్రాలు అందుకున్న వారిని గ్రామానికి చెందిన పద్మశాలి కులస్తులు శనివారం ఘనంగా సత్కరించారు.

పాఠశాలల్లో రక్షాబంధన్

బోథ్: మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం రక్షాబంధన్ నిర్వహించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, నాగబూషణం, వేదం, విజ్ఞాన్, సొనాలలోని వివేకానంద ఉషోదయ పాఠశాలల్లో విద్యార్థినులు , విద్యార్థులకు రాఖీ కట్టారు.

సొసైటీలో విచారణ

బోథ్: బోథ్ పీఏసీఎస్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ (కోఆపరేటివ్) అధికారిణి అరుణ శనివారం విచారణ చేపట్టారు. ఎనిమిది నెలలుగా పాలకవర్గ సమావేశం నిర్వహించకపోవడంతో ఇటీవల పలువురు డైరెక్టర్లు డీసీవోకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపారు. మినట్స్ బుక్‌ను పరిశీలించారు. పలు వివరాలను సీఈవో స్వామిని అడిగి తెలుసుకున్నారు.

మండల కమిటీ ఎన్నిక

సిరికొండ: మండలంలో శనివారం నూతనంగా విశ్వ హిందూ పరిషత్ మండల కమిటీని శివాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశ్వ హిందు పరిషత్ మండల నూతన అధ్యక్షుడిగా ఉయిక కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా ఎగ్గిడి మల్లేశ్, దోండే సోమనాథ్, కార్యదర్శిగా మణికంఠ యాదవ్‌ను ఎన్నుకున్నారు.

ఎంపీ గోడం నగేశ్ పరామర్శ

బజార్‌హత్నూర్: మండలంలో ఇటీవల మృతి చెందిన వారి బాధిత కుటుంబాలను ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గోడం నగేశ్ శనివారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ వెంట ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న, శ్రీనివాస్, గణేశ్, శంకర్, ఉత్తం, రాములు, భోజరెడ్డి, గోవింద్, రాజేశ్వర్ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఇచ్చోడ: గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం రాత్రి ముఖరా(బి) గ్రామాన్ని సందర్శించి మాట్లాడారు. విద్యుత్, తాగు, సాగు నీరు, కనీస మౌలిక వసతుల కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో ముఖరా(బి) మాజీ సర్పంచ్ అడమ్మా రుతి పాల్గొన్నారు.

లీకేజీకి మరమ్మతులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ గ్రామం రామ మందిరం కల్వర్టు సమీపంలోని వంతెన వద్ద పైప్‌లైన్ లీకేజీపై 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. శనివారం లీకేజీకి మరమ్మతులు చేయించారు.

పారిశుధ్య పనులు నిర్వహణ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని కొన్ని గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణల్లో పారిశుధ్యం లోపించడంతో 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. శనివారం అధికారులు ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నిర్వహించారు. నీరు నిల్వ ఉన్న చోట మట్టి పోశారు.

గ్రామాల్లో శ్రావణ మాస పూజలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శ్రావణ మాస పూజలను ఘనంగా నిర్వహిస్తున్నారు. హనుమన్ మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం గ్రామ పటేల్ గేడం జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో నగర భోజనం అందించారు. మండలంలోని మర్కగూడ గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నగర భోజనం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల పెద్దలు మడావి విశ్వనాథ్, కనక భీంరావ్, కుమ్ర భీంరావ్, గేడం దేవ్‌రావ్, సోనేరావ్, మెస్రం ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

శాటిలైట్ సెంటర్ ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

నార్నూర్: విధుల్లో నిర్లక్ష్యం వహించిన అర్జుని కొలాంగూడ శాటిలైట్ సెంటర్ ఉపాధ్యాయుడు అశోక్‌ను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సస్పెండ్ చేసినట్లు ఏటీడీఓ క్రాంతికుమార్ తెలిపారు. శనివారం గాదిగూడ మండలంలోని అర్జుని కొలంగూడ శాటిలైట్ సెంటర్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్‌తోపాటు విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. ఉపాధ్యాయుడు జాదవ్ నారాయణకు అశోక్ సస్పెన్షన్ ఉత్తర్వులు అందజేశారు. అనంతరం బాలికల ఆశ్రమ పాఠశాల తనిఖీ చేశారు. పాఠశాలలో తాగునీటి సమస్యపై ఫిర్యాదు రావడంతో బోర్‌వెల్ పరిశీలించారు. విధుల నిర్వహణ విషయంలో ఐటీడీఏ పీవో సీరియస్‌గా ఉన్నారని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

భీంపూర్ ఏవోగా శ్రీనివాస్ రెడ్డి

తాంసి: భీంపూర్ మండల వ్యవసాయాధికారిగా శనివారం శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు తాంసి ఏవోగా ఉన్న రవీందర్ మండల ఇన్‌చార్జ్‌గా ఏవో పనిచేశారు. బదిలీల్లో భాగంగా శ్రీనివాస్ రెడ్డిని భీంపూర్ వ్యవసాయశాఖ అధికారిగా బదిలీ చేశారు. ఆయనను రైతులు, నాయకులు శాలువాతో సన్మానించారు. మాజీ రైతుబంధు సమితి అధ్యక్షుడు అనిల్, అమర్ రెడ్డి, సంతోష్, రాజన్న, వినోద్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం రైతులను మరోసారి మోసం చేసిందని బీజేపీ నేరడిగొండ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.2 లక్షల రుణాలను మాఫీ చేస్తామని ఎన్నిలప్పుడు దొంగ హామీనిచ్చి దొడ్డిదారిన డిసెంబర్ 9న గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరా కోతలు పెడుతూ కేవలం 46 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తోందన్నారు.